# పరాజిత

రామం అకస్మాత్తుగా తమ యింటికి రావడం ఆశ్చర్యం కలిగించింది రామనాథంకి. "ఏఁవిటోయ్, ఓ వుత్తరం ముక్కయినా రాయకుండా వచ్చేశావు? ఆరుపైసలు వ్యయ మెందుకని మానేశావా?" నవ్వుతూ అన్నాడు. "అదేమీ కాదు మాఁవయ్యా! మీ యింటికి రావడానికి ముందుగా ఉత్తరమెందుకని మానేశాను. అయినా నాకేం కొత్తగనకనా మీ యిల్లు!" "ఆమాట నిజమే అనుకో! సరేగాని, నాన్నా, అందరూ కులాసాయేనా!" "కులాసాయే మాఁవయ్యా!"

అప్పుడే లోపల్నుంచి వచ్చిన లక్ష్మి, రామంని మామూలు ధోరణిలో పలుకరించింది. ఆమె మాటల్లో చెప్పుకో దగ్గ ఆప్యాయత ధ్వనించక పోవడం, అతని మనసుకి కష్టం కలిగించిన మాట వాస్తవమే! అవుతే, ఆమె యెందుకలా ముభావంగా వుందో, కారణంకోసంవూహించి విఫలుడయ్యాడు. "లోపలికి పద రామం... లక్ష్మి నీళ్ళు తోడించు... స్నానం చేస్తాడు..." అంటూ రామంని ప్రక్కగదికి తీసుకుని వెళ్ళాడు రామనాథం.

స్నానం చేసివచ్చిన రామం, గదంతా ఓసారి కలయ జూశాడు. గది యెంతో పరిశుభ్రంగా వుంది. అతని దృష్టి

అప్రయత్నంగా టేబిలు మీదున్న ఫోటోపై బడింది. రెండడుగులు ముందుకు పడ్డాయి. అది నిర్మల ఫోటో అనడానికి యేమాత్రమూ సందేహంలేదు. అవుతే, ఆమెలో చాలా మార్పు వచ్చినట్టు తోచింది. ఫోటోను చేత్తో పట్టుకుని, పరిశీలనగా చూశాడు. అయిదేళ్ళక్రితం తను చూసిన నిర్మల, యిప్పుడు పూర్తిగా మారిపోయింది. కలువరేకుల్లావున్న ఆ కళ్ళు, మందహాసం చిందిస్తూ వంపులుతిరిగిన ఆ సన్నని పెదాలు, ఆమె అందానికి మెరుగు పెడుతున్నా యనుకున్నాడు. ఇంక అక్కడే అలా నుంచోవడం బావుండదని భావించి, ఫోటోను పెట్టేసి, బైటికి నడిచాడు.

కాస్సేపటి తర్వాత రామనాథం, రామం, భోజనాలకు కూర్చున్నారు. లక్ష్మి వడ్డన సాగిస్తోంది. రామం మౌనంగా కూచోలేక పోయాడు.

"ఏవిటి మావయ్యా. మీరు పట్నం రావడమే మానేశారు? అంతా కలిసి ఓసారి వస్తే యేం పోయింది?" అన్నాడు.

"పిలుపడ్డంలేదు రామం. లేకపోతే, మీయింటికి రావడానికేం?"

వడ్డన పూర్తిచేసి, అక్కడే నిల్చున్న లక్ష్మి వూరుకోలేకపోయింది.

"అయినా నాయనా, మాలాంటివాళ్ళం పట్నం యెందుకు లెద్దూ. ఏదో పల్లెటూరి వాళ్ళం. పల్లెలోనే బ్రతకనీయ్..." అంది మెల్లగా.

ఆమె మాటలు కాస్తంత చుఱ్ఱుమనిపించాయి రామంకి. ఆమె అలా అనడానికి యేదో కారణం తప్పకుండా వుండి వుంటుందని అతని వూహ. ఆలోచనల నుండి తేరుకునే లోపల రామనాథం అందుకున్నాడు.

"మీ అత్తయ్య మాటలకేం లేవోయ్! దాని తత్వమే అంత. పల్లెలోనే వుండిపోయామని దాని బాధంతాను. నిజానికి, నాకు తీరిక చిక్కడం లేదు. పోనీ, మీ అత్తయ్యా, నిర్మలా వస్తారూ అంటే దాని చదువు పోతుందంటుంది నిర్మల. అందుకే, యెవ్వరమూ రాలేకపోయాం..." సర్దేశాడు రామనాథం.

"అవుతే, నిర్మల యిప్పుడేం చదువుతోంది మావయ్యా? ప్రసక్తి మార్చేశాడు.

"స్కూలు ఫైనల్ చదువుతోంది. ఈ సంవత్సరంతో చదువు మాన్పించేసి, యేదో మాకు తగిన సంబంధం ఒకటి చూసి, పెళ్ళి జరిపించేయాలనివుంది.'' అన్నాడు రామనాథం.

లక్ష్మమ్మ మౌనంగా వుండలేక పోయింది. ''అయినా, పల్లెటూళ్ళలో యేం చదువుల్లే నాయనా! ఊరికనే యింట్లో కూచోవడ మెందుకని వుబుసుపోకకి చదువుకుంటోంది." మళ్ళీ అదే ధోరణిలో అంది లక్ష్మమ్మ.

రామం మనస్సు చివుక్కుమంది. ఆమె అదేధోరణిలో మాట్లాడుతూ వుండటం, నిరుత్సాహాన్ని కలిగించిందనే చెప్పాలి. రామనాథంకి మాత్రం కోపం వచ్చింది.

"లక్ష్మీ! ఇక చాలించాధోరణి" కసురుతూ అన్నాడు.

"ఉన్నమాటే అన్నానుకదండీ" మెల్లగా అని వూరుకుంది.

అప్పటికే వారి భోజనాలు ముగిశాయి. పెరట్లోకి పోయారు చేతులు కడుక్కుందుకు.

* * *

ఆరోజు సాయంత్రం, అలా తోటలోకి వెళ్ళి రావాలని బైలుదేరాడు రామం. లోగిలి దాటకముందే, నిర్మల స్కూలు నుండి తిరిగివస్తూ యెదురయ్యింది. ఆమెను చూస్తూనే అతని కనురెప్పలు స్తంభించిపోయాయి. ఫోటోలో చూసిన నిర్మలకంటె, ప్రత్యక్షంగా చూస్తున్న నిర్మల మరీ అందంగా, ఆకర్షణీయంగా కనిపించింది రామంకి. రామంని చూడగానే ఆమె మొహం సిగ్గుతో యెర్రదనాన్ని పుంజుకుంది.

"ఏం నిర్మలా! నేను గుర్తున్నానా?" నవ్వుతూ అన్నాడు రామం.

"గుర్తులేకేం బావా! మేం భాగ్యవంతులమా చెప్పా-మనుషుల్ని మర్చిపోడానికి! అదీగాక మేం పట్నవాసులం కూడా కాదు." మందహాసంతో అనేసి, ముందుకుపోయింది.

రామంకి మరో షాక్ తగిలింది. ఏమిటో వీళ్ళధోరణి, అతనికి అర్థంకాలేదు. ఏమిటి వీళ్ళ యెత్తిపొడుపులు? వీటి వెనుక దాగివున్న కథ యేమిటి...యెంత ఆలోచించినా, అతని వూహకి అందలేదు. హృదయభారంతో ముందుకు సాగాడు.

రాత్రి భోజనాలయ్యాక, రామంకి బైట వరండాలో పక్క వేశారు. రామనాథం కూడా అతని ప్రక్కనే మంచం వేసుకున్నాడు. నిర్మలతో కొద్దిక్షణాలు మాట్లాడాలన్న అభిప్రాయం అతనిలో వున్నా, అది ఫలించే అవకాశం లేక పోయింది. ఎందుకూ అంటే, నిర్మల అతనికి దూరంగా వుండాలనే ప్రయత్నిస్తూ వుండటం గమనించాడు రామం. అందుకు కారణం యేమిటో అంతుచిక్క లేదు.

పదిన్నర దాటింది. బైట పిండారబోసినట్లుగా వెన్నెల ప్రకాశిస్తోంది. చల్లని పిల్లవాయువులు, హృదయానికి వూరట కలిగిస్తున్నట్టుగా వీస్తున్నాయి. రామంకి యింకా నిద్రదేవత అనుగ్రహించలేదు. ఉండుండి, రామనాథం యేవో ప్రశ్నలు వేస్తుంటే, పరధ్యానంగా యేవో జవాబులు చెప్తున్నాడు. చివరికి ఆసక్తిని అరికట్టలేక, తనూ ఓ ప్రశ్న వేశాడు.

"అవుతే మాఁవయ్యా; యీ సంవత్సరం చదువు పూర్తయితే, నిర్మలను పట్నంలో చదివిస్తారా?"

"అబ్బే: ఆడపిల్లలకి అంతలేసి చదువులెందుకు? అదీ గాకండా, మీ అత్తయ్యకూడా ఒప్పుకోదు. పెళ్లి చేసెయ్యాలని చూస్తున్నాను".

"అత్తయ్య ఒప్పుకోదా? కారణం...?" అడిగాడు చప్పున రామం.

"కారణం యేముంటుందని చెప్పడం? ఆడవాళ్ల మనస్తత్వం అర్థం చేసుకుందుకు, సృష్టికర్త బ్రహ్మకే తరం

కాకపోతే, మనమనగా యెంత చెప్పు: చాలా వేళయినట్టుంది. పడుకో! ఆ విషయాలు ఆలోచించాల్సిన సమయం వస్తుందిలే!" తేలిగ్గా నవ్వుతూ అనేశాడు.

రామంకి, ఆ జవాబు తృప్తిని కలిగించలేక పోయింది. మాఁవయ్యకి, విషయం తెలిసికూడా తప్పించుకుంటున్నాడని, వూహించగలిగాడు...అంతే! మరేవిధమైన ప్రస్తావన సాగలేదు. కొద్దిసేపటికి రామంకి నిద్రపట్టేసింది.

*　　　*　　　*

రామం వచ్చి, అప్పుడే మూడు రోజులయ్యింది. బైలుదేరుతున్నపుడు తల్లిచెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. "రెండురోజులుండి వచ్చేయరా నాయనా! అక్కడ నువ్వు వుండలేవు" అని. అవుతే, తీరా యిక్కడికి వచ్చాక, తొందరగా తిరిగి పోవడానికి మనస్కరించలేదు రామంకి. కాని, ఒక్క బాధ మాత్రం లేకపోలేదు. నిర్మలతో సన్నిహితంగా మాట్లాడాలని తను యెంత ప్రయత్నిస్తున్నా, ఆమె యెందుకలా తనని తప్పించుకు తిరుగుతున్నదో, అతనికి అవగాహన కాలేదు. తనపట్ల ఆమెకి యెందుకా నిరసనభావం? తను ఆమెకి యేమీ అపకారం చెయ్యలేదే! లేకపోతే, ఆమెలోని అహంకారం అలా చేయిస్తున్నదా? ఉహూ! అది నిజమైయ్యుండదు. ఆమె మొహం చూస్తుంటే, అహంకారంవున్న మనిషిలా కనిపించదు. అవుతే కారణం యేఁవిటి! ...తనలో తనే పరిపరివిధాల ప్రశ్నించుకున్నాడు. కాని, సమాధానం దొరకలేదు.

నాలుగోరోజు, స్కూలుకి శలవని యింట్లో వుండిపోయింది నిర్మల. ఆమె ఒంటరిగా వున్న అవకాశం చూసుకుని, ఓ ప్రశ్న వేశాడు రామం.

"నేను వచ్చి నాలుగు రోజులయ్యింది. ఈ నాలుగు రోజుల అనుభవంలోనూ నేను గ్రహించింది యేమిటంటే, నన్ను తప్పించుకు తిరుగుతున్నావు. దానికి కారణం యేమిటో చెప్తే సంతోషిస్తాం." వ్యంగ్యధోరణిలో అన్నాడు.

నిర్మల మొహం దించుకుంది. ఆమె యేం సమాధానం చెప్తుందోనని ఆతృతతో వున్నాడు రామం.

"ఎవరి హద్దుల్లో వాళ్లు వుండటం, యెవరి అంతస్థులు వారు తెలుసుకొని మాట్లాడ్డం శ్రేయస్కరం బావా! మేం దూరంగా వుండటమే మంచిది..." అనేసి, మరో మాటకైనా యెదురు చూడకుండా వెళ్లిపోయింది విసురుగా, నిర్మల.

రామం హృదయంలో యెవరో చేయిపెట్టి కెలికినట్టయ్యింది. అతని కళ్ళల్లోనీరు గిర్రునతిరిగింది. తనింక అక్కడ వుండలేడు. ఉండి ,అనుభవిస్తున్న ఆనందం యేమిటని ? తక్షణం తిరుగుముఖం పట్టాలని తీర్మానించుకున్నాడు.

మరునాడే బైలుదేరాడు.

"మరి రెండు రోజులు వుండకూడదటోయ్..." అన్న రామనాథం మాటలకూడా కరిగిపోలేదు.

"మళ్ళీ మరోసారి వస్తాలెండి..." అనేశాడు.

* * *

రామం యిల్లు చేరుకున్నాక, తల్లి కోపంగా అడిగింది.

"ఏంరా రామం, ఆవూరు వదలబుద్ధి పుట్టలేదేంవిట్రా?"

"చాలా రోజుల తర్వాత వెళ్ళాను కదమ్మా, మాఁవయ్య రెండురోజులు వుండమంటేనూ, అతని మాట కొట్టిపారేయలేక పోయాను..."

"అదీ, అలా చెప్పు. వాళ్ళు వుండమంటారని నాకూ తెలుసు." చిరుకోపంతో అంది.

"బంధువులు గాబట్టి, వుండమన్నారు. అందులో తప్పేముంది కమలా? అదీగాక, రామనాథం నేనూ బాల్య స్నేహితులం. బంధుత్వమూ, స్నేహమూ రెండూ వున్నాయి గాబట్టే, అంత చనువుగా వుండమన్నాడు." కొడుక్కి ఆసరాగా వచ్చాడు రాఘవయ్య.

భర్త, కొడుకుని అలా వెనకేసుకురావడం, కమలమ్మకి మరీ కోపం తెప్పించింది.

"ఆ! అంతా బంధువులే! వాళ్ళకి అవసరం వుంది గాబట్టి, లేని బంధుత్వాలు కలుపుకుంటున్నారు. ఒరేయ్ అబ్బాయ్, వాళ్ళ పన్నాగం నీకు తెలీదురా. వాళ్ళఅమ్మాయి, నిర్మల లేదూ – దాన్ని నీకు ముడిపెట్టాలని, యెన్నాళ్ళనించో ప్రయత్నిస్తున్నారు. చూడు వాళ్ళ ఆశ! ఈ మధ్య యెవరో వాళ్ళకి కావాల్సిన వాళ్ళేట... ఈ విషయం నా దగ్గర ప్రస్తావించారు. నాకు వళ్లు మండిందంటే నమ్మ. తాహతు

తెలుసుకుని, అంతస్థులు గుర్తించుకొని మాట్లాడమని నాలుగు చీవాట్లు పెట్టాను. లేకపోతే, ఆ పల్లెటూరువాళ్ళు, మనతో వియ్యం పొందాలని ప్రయత్నించడ మేమిటి? అర్థంలేని విషయం... అసలు, నువ్వు అక్కడికి వెళ్ళడమే నాకు యిష్టం లేదు. వద్దురా అంటే, వినిపించుకునే మనిషివి కాదు నువ్వు... మీ నాన్నగారు నిన్ను ప్రోత్సహించడం, మరీ బలం చేకూర్చింది నీకు... నా మాట వినకపోతే, తరువాత పశ్చాత్తాప పడతావ్. నా కేం?" అనర్గళంగా వుపన్యాసం యిచ్చింది కమలమ్మ.

రాఘవయ్య కిమ్మనకుండా కూచున్నాడు. వీలయినంత మేరకు, అతను భార్యతో వాగ్వివాదానికి దిగడు కూడాను.

ఏ సమస్యను పరిష్కారం చేసుకోలేక, రామం సతమత మౌతున్నాడో, ఆ సమస్య యిప్పుడు సులువుగా పరిష్కృత మయ్యింది. నిర్మల, వాళ్ళమ్మ, ధోరణుల వెనుకగల కథా కమామీషూ, వారి యెత్తిపొడుపుల గూఢార్థాలు, యిప్పుడు అవగతమయ్యాయ్.

"అమ్మా, అంతా బాగానే వుందిగాని, నువ్వు వారి పరోక్షంలోనైనా సరే, వారి నా విధంగా కించపర్చడం, చాలా అన్యాయం." తెగించి అనేశాడు.

కమలమ్మ విస్తుపోయి కొడుకుకేసి చూసింది. కొడుకు అప్పుడే వాళ్ళ పక్షంవాడై పోయాడేమిటో, నని కలవరపడింది. "ఏమిట్రా నువ్వంటున్నది?" తీక్ష్ణంగా చూస్తూ అంది.

"లేకపోతే యేమిటమ్మా! ఎవరో మధ్యవర్తులు ఆ ప్రసక్తిని తీసుకొచ్చినంత మాత్రాన, నువ్వువారి నా విధంగా అవమానపర్చడ మేమిటి? నువ్వు అలా అనబట్టే, నే నక్కడ వున్న యీ నాలుగురోజులూ, తల్లి కూతుళ్ళు అంతస్థుల విషయమే సూటిగా, చుర్రుమనేలా అనేవారు. ఒక్కొక్కప్పుడు, నేనెంతగా బాధపడేవాణ్ణో, ఆ భగవంతుడికే తెలియాలి. అవుతే, వాళ్ళలా అంటున్నందుకు, అప్పట్లో కారణం గ్రహించలేకపోయేను. ఈ పద్ధతేగాని, మరికొన్నాళ్ళు సాగితే, యీ రెండు కుటుంబాలమధ్య, అగాధం యేర్పడ్డం తథ్యం!" అన్నాడు విసురుగా.

"అలా జరిగితే, మరీమంచిది,..." నిష్కర్షగా అనేసింది.

రామం ఆశ్చర్య పోయాడు. తండ్రివేపు ఓ సారి దృష్టిని సారించాడు. ఆయన నిశ్చలంగా అలా కూచునే వున్నారు. ఏమీ కలిగించుకోకుండా నాన్న యెలా కూర్చో గలిగారో, రామంకి ఓ పట్టాన అర్థంకాలేదు. "అయినా అమ్మా, వాళ్ళ మీద నీ కెందుకంతకసి చెప్పు? నీకు వాళ్ళేం అపకారంచేశారు?"

కమలమ్మ కోపం, పరాకాష్ఠ నందుకుంది. తనని కాదని, వాళ్ళని వెనకేసుకొస్తున్న కొడుకు ధోరణి ఆమెకి నచ్చలేదు.

"నీకు సంజాయిషీ చెప్పుకునేటంత దుర్గతి, నాకింకా పట్టలేదురా." వుక్రోషంతో అంటూ చరచరా వెళ్ళిపోయిం దక్కణ్ణించి.

రామం, నిస్పృహతో నిట్టూర్చి, తన గదివేపు నడిచాడు. మౌనంగా వున్న రాఘవయ్య చిన్నగా నవ్వుకున్నాడు. ఆ నవ్వుకి అర్థం అతనికే తెలియాలి మరి.

* * *

రాత్రి తొమ్మిది దాటింది. రాఘవయ్య వార్తాపత్రిక చదువుకుంటున్నాడు. కమలమ్మ లోపల్నించి వచ్చింది. తన సహజ ధోరణిలో వుపన్యాసం ప్రారంభించింది. రాఘవయ్య, చదువుతున్న పత్రిక, మూసివేశాడు. ఆమె ఆరోపణ యింకేమీ కాదు. రామనాథం తన కూతుర్ని యెలాగైనా రామంకి ముడి పెట్టాలని ప్రయత్నిస్తున్నాడనీ, అందుకే అబ్బాయిని నాలుగు రోజులపాటు వాళ్ళింట్లో వుంచుకుని, యేవేవో నూరిపోసి, వాడి అభిమానం సంపాదించాడనీ చెప్పుకుపోతోంది. రాఘవయ్య శాంతంగా వింటున్నాడు. తల్లికి కనిపించకండా రామం కూడా వింటున్నాడు.

తను అనర్గళంగా అంత వుపన్యాసం యిచ్చినా, భర్త యేమీ అనకపోవడం, కమలమ్మకి కించిత్ బాధనిపించింది.

"మీరేమీ మాట్లాడరేమండీ?" అంది వుడుకుమోత్తనంగా.

"ఏం మాట్లాడమంటావు కమలా! ఎవరేం నూరి పోసినా, వినడానికి మనవాడేం చంటిపిల్లవాడు కాదు. వాడికి స్వతహాగా, మంచీ చెడూ నిర్ణయించుకునే వయస్సు వచ్చింది. ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటానని, వాడేం నీతో చెప్పాడా?

పోతే వాడికి ఆ అమ్మాయి నచ్చిన పక్షంలో, నువ్వు వద్దంటే మానేస్తాడని నాకునమ్మకం చాలదు. పాతరోజులుకావు కమలా!" అన్నాడు రాఘవయ్య.

"భేష్! బాగా చెప్పారు నాన్నా!" వుత్సాహంతో అంటూ ముందుకు వచ్చాడు రామం. తండ్రిసమక్షంలో అలా అన్నందుకు తరువాత విచారించాడు కూడాను.

కొడుకుగొంతు విని, కమలమ్మ మొహం చిట్లించుకుంది.

"ఆ! మీ నాన్నగారు చెప్పడానికేంలే!" కోపం ప్రదర్శించింది.

"అది కాదమ్మా! అకారణంగా మనం యెవర్నీ అసహ్యించుకోకూడదు. ఇటీవల నువ్వు నిర్మలను చూడలేదనుకుంటాను... ఇప్పుడు యెంత అందంగా వుందని..." వుత్సాహాన్ని ఆపుకోలేక అనేసి నాలుక కొరుక్కున్నాడు.

"చాల్లేరా యిక..." మెల్లగా మందలించాడు రాఘవయ్య.

"మీరిచ్చిన అలుసే అది! చూశారా వాడెంతగా మారిపోయాడో!" అదోలా మొహం పెడుతూ అందామె.

రాఘవయ్యకి నవ్వొచ్చింది, భార్య అవస్థచూసి.

"నిర్మల నచ్చింది గామోసు, అంటున్నాడు. దానికేం? వీడికోసం సంబంధాలు చూళ్ళేక, మనమూ విసిగిపోతున్నాం. ఇంకెందుకు మనకి శ్రమ? ముహూర్తం నిశ్చయించి, పెళ్ళి

చేసేస్తేపోయె... రామనాథం మనకి పరాయివాడేం కాదు కూడాను..."

కమలమ్మ ఛర్రున లేచింది. ఆమెకళ్ళు నిప్పుకణాల్లా ప్రజ్వలిస్తున్నాయి.

"ఏఁవిటండీ మీారన్నది? పెళ్ళిచేస్తారా? అలా వీల్లేదు, నేను బ్రతికివుండగా, ఆ సంబంధం చెయ్యడానికి ఒప్పుకోను." స్వరం హెచ్చించి అంది.

తల్లిధోరణి, రామంకి కోపం తెప్పించింది. "అమ్మా! పట్టుదలఅన్నది, నీలోనే వుందని అనుకోకు. ప్రాణమున్న ప్రతి జీవికీ వుంది. నిర్మలను పెళ్ళి చేసుకోవాలనే నా వుద్దేశం... అది నా నిర్ణయంకూడాను. ఆపైన నీ యిష్టం..." ధైర్యంగా చెప్పాడు రామం. అతనికీ తెలుసు—తండ్రి తనపక్షమే వుంటారని. అందుకు కారణం – ఆయనకీ, రా మ నా థం కీ వున్న సన్నిహిత స్నేహామే.

కమలమ్మ తెల్ల మొహంవేసి, భర్తకేసి చూసింది. "వీణ్ణి కాస్త గదమాయించక, అలా వింటూ వూరుకుంటారేఁవిటండీ." ఫిర్యాదు చేయక తప్పింది కాదామెకి. ఆమె స్వరం బొంగురు పోయింది.

"కమలా! నువ్వు అనవసరంగా తొందరపడుతున్నావు. ఆ తొందరపాటులో, పొరపాట్లు చేస్తున్నావు. ఈ యుగంలో, యిటువంటి విషయాల్లో, మన పంతం నెగ్గాలని పట్టుబట్టడం, యేమంత మంచిదికాదు. రేపు వాడే స్వయంగావెళ్ళి నిర్మలను

పెళ్లి చేసుకుని, వేరే కాపురం పెడతాడనుకో! అప్పుడు నువ్వేం చెయ్యగలవు చెప్పు? అప్పుడు నీ పంతం నెగ్గకపోవడమే కాకుండా, కొడుకు దూరమయ్యాడని యేడుస్తావు. బాధపడతావు... కుమిలిపోతావు. ఇదేగా నీకు మిగిలేవి? అప్పుడు నీ పట్టుదల నిన్ను ఓదారుస్తుందా? ఇంతకీ, కోడలుగా యెవరొచ్చి మాత్రం మనల్ని వుద్ధరించేదేవిటి? ఆ కాస్త గౌరవం దక్కించుకుంటే పోయేదిగా!" సౌమ్యంగా అన్నాడు రాఘవయ్య.

భర్త చెప్పినవన్నీ జరుగుతాయేమోనని ఒక్కసారి వూహించుకునే సరికి, కమలమ్మకి కళ్లు తిరిగినంత పనయ్యింది. దూరంగా యోచిస్తే, భర్త చెప్పింది సబబుగా వున్నట్టు తోచింది. తను యీ విధంగా ఓడిపోతానని యెప్పుడూ అనుకోలేదామె. "రామం, నువ్విలా మారిపోతావని అనుకోలేదురా!" రుద్ధస్వరంతో అంది.

రామం యేమీ అనకుండా మొహం దించుకున్నాడు.

"మార్పు, మానవసహజం కమలా! అవుతే, ఆ మార్పును గుర్తించి ప్రవర్తించడమే మనుషులు నేర్చుకోవల్సింది." అన్నాడు రాఘవయ్య.

"అయితే, యింక ఆలస్య మెందుకు? రామనాథం అన్నయ్యకి ఉత్తరం రాయండి..." అనేసి అక్కణ్ణించి వెళ్ళిపోయింది చిన్న మొహం చేసుకుని.

రాఘవయ్య కొడుకువేపు చూసి, ముసిముసి నవ్వులు ఒలకబోశాడు. రామం ఉత్సాహంగా తన గదికేసి నడిచాడు.

* * *

రాఘువయ్య రాసిన ఉత్తరానికి జవాబుగా, రామనాథం దగ్గర్నించి ఉత్తరం వచ్చింది. రాఘువయ్య ఆ ఉత్తరం చదువుకుని విస్తుపోయాడు. అటువంటి జవాబు వస్తుందని అతనూ అనుకోలేదు.

"కమలా! ఓసారి యిలా రా." కేక వేశాడు భార్యని.

కమలమ్మ ఆత్రంగా వచ్చింది, "ఏమయ్యిందండీ!" అనుకుంటూ. రామం కూడా తన గదినుండి బైటికి వచ్చాడు.

"రామనాథం ఉత్తరం రాశాడు." ముక్తసరిగా అన్నాడు రాఘువయ్య!

"హఠాత్తుగా మనం యీ నిర్ణయానికి వచ్చినందుకు, ఆనందం పట్టలేకపోయి వుంటాడు. ఆనందం కాదూ మరి! నిర్మల మనయింటి కోడలవుతుందని రామనాథం దంపతులు, కలలోకూడా అనుకోలేదేమో." సహజధోరణిలో అందామె.

"నీ వూహాలన్నీ యెప్పుడూ యిలాగే వుంటాయిగాని, ఆదే జరగలేదు."

"అంటే?" ఆశ్చర్యంతో అంది.

"ఈ వివాహానికి, నిర్మల ఒప్పుకోవడం లేదట..."

రామం నిశ్చేష్టుడయ్యాడు. నిర్మల ప్రవర్తనకి అర్థం యేమిటి? ఆమె పట్టుదల యితనికి అతి క్రూరంగా కనిపించింది. కమలమ్మ మొహం రాగరంజిత మయ్యింది. "ఎంత పొగరు! కోరి అడుగుతున్నాం కదూ — కొండెక్కి కూచుంటోంది.

ఇప్పుడు నీ మర్యాద యేమయ్యిందిరా? అందుకే, పెద్దవాళ్ళ మాట వినరా అంటే, నీ పట్టుదల నీదేను." అంటూ సగర్వంగా వ్యాఖ్యానించింది.

రాముంలో ద్వేషంగాని, కోపంగానీ, పుద్భవించ లేదు. నిర్మలను పెళ్లి చేసుకోవాలనే ఆసక్తి యింకా పెరిగింది.

"అమ్మా! నిర్మల నిరాకరించడానికి, వేరే కారణం ఏమీ వుండదు. నీ నిరసనమాటలే, ఆమెను అలా మార్చాయి. నువ్విప్పుడు స్వయంగా వెళ్లి చెబితే కాదనలేదేమో!" అన్నాడు ప్రాధేయంగా. తండ్రివేపు దీనంగా చూశాడు.

"ఔను కమలా! నొప్పి కలిగించిన వాళ్ళే, తమతప్పు తెలుసుకొని నచ్చజెబితే, ఫలితం వుంటుందని నా నమ్మకం. ఇంక జాప్యం యెందుకు? రేపే ప్రయాణం కడదాం..." అన్నాడు రాఘవయ్య. అతను వాంఛించింది కూడా యీ సామరస్యమే!

కమలమ్మ సందిగ్ధంలో పడింది. తను స్వయంగా వెళ్ళి, అభిమానం చంపుకొని, అడగడమా? ఇంతకంటె అవమానం యింకేముంది?... అన్న స్వాతిశయం తలెత్తిందామెలో.

"నేనురాను..." కాస్త కటువుగానే అంది. "నేను వెళ్లి మొన్న మొన్నటిపిల్ల – ఆ నిర్మలను ప్రాధేయపడ్డమా?"

"అమ్మా! ప్రాధేయపడమని, యెవరూ చెప్పడంలేదు. నచ్చజెప్పేరీతిలో అడిగితే చాలు. నాపట్ల నీకు యేమాత్రం

మమతవున్నా, నువ్వు నిరాకరించవు..." ఏడుపు మొహం పెడుతూ అన్నాడు రామం.

"చావొచ్చి పడిందిరా నీతో! సరే – రేపే ప్రయాణ మౌదాం..." అనేసి విసురుగా వెళ్ళిపోయింది. అలా అనేసిందే గాని, లోలోపల బాధపడింది. కాని, ఏం చేస్తుంది? ఒక్కగా నొక్క కొడుకు... ఏ అఘాయిత్యానికి తలపడతాడో నని ఆమె భయం!

*  *  *

రాఘవయ్య కుటుంబంతో తన యింటికి వచ్చినందుకు మురిసిపోయాడు రామనాథం.

నిర్మలనుచూసి కమలమ్మ అంది. "బాగా మారిపోయిందండీ!"

"అందుకే, మనవాడు పట్టుబట్టాడు..." జవాబిచ్చాడు రాఘవయ్య.

"ఏఁవే నిర్మలా – నువ్వు మావాణ్ణి పెళ్ళి చేసుకోనని ఖచ్చితంగా చెప్పేశావట. ఏం? వాడు నీకు తగడనా?" వెంటనే అడిగేసింది కమలమ్మ.

నిర్మల, మొదట్లో కాస్త జంకినా, వుక్రోషం వుప్పెనలా పొంగుకొస్తుంటే, జవాబు చెప్పకండా వుండలేక పోయింది.

"మావంటి వాళ్ళం – మీ యింటికి కోడలవడానికి తగం కదూ అత్తయ్యగారూ! పెద్ద వూహాలెందుకని, అలా అనేశానంతే!" మొహం దించుకునే అంది.

రాఘవయ్య ఫక్కున నవ్వేడు. లక్ష్మికీ, కూతురుజవాబు యెంతో సంబరం కలిగించింది. కాని, కమలమ్మకి మాత్రం, నిర్మల జవాబు శూలపుపోటులా బాధించింది. అయినా, కొడుకు మీది అభిమానంకొద్దీ కోపం తెచ్చుకోలేదు.

"ఎప్పుడో, యేదో, యెవరితోనో, అన్నానని, ఆ మాటలు యిప్పుడిలా దెప్పి, సాధిస్తున్నావన్నమాట! పట్నం వాసివి కాకపోయినా, పెంకిఘటానివే; అవన్నీ మర్చిపో! ఇప్పుడు మేమేవచ్చి అడుగుతున్నాంగా! యింక అభ్యంతర మేముంది?" అంది కమలమ్మ.

ఈ ప్రసంగం యింక పొడిగింపబడ కూడదనుకున్నాడు రామనాథం.

"నిర్మలా! నీకేం మతిపోయిందా యేఁవిటి? తగు పెద్దమనుషులు స్వయంగా వచ్చి, అడగడమే చాలు ..." అన్నాడు ఆయన కోపంతో.

నిర్మలకి, యింక ధైర్యం చాలిందికాదు. తన పంతం నెగ్గిందన్న ఆనందం ఓప్రక్క, రామంకి భార్యనవుతున్నానన్న సంతోషం మరోప్రక్క, ఆమెను వుక్కిరిబిక్కిరి చేశాయి. సిగ్గుతో ఆమె మొహం యెరుపెక్కింది.

"మీ యిష్టమే, నా యిష్టం నాన్నా!" అనేస్తూ, అక్కణ్ణించి చరచరా వెళ్ళిపోయింది.

అందరూ తృప్తిగా నిట్టూర్చారు. రామం ఆనందానికి అంతులేదు.

"ఎవరి పంతాలు వారు నెగ్గించుకున్నారు. చివరికి ఓడిపోయినదానను నేనే." నవ్వుతూనే అంది కమలమ్మ.

"జయాపజయాలు దైవాధీనం కమలా! అందుకు నువ్వు బాధపడ నవసరంలేదు...." అనునయిం పర్చాడు రాఘవయ్య.

"ఏమైతేనేం—నాకు తగిన కోడలే" నవ్వింది కమలమ్మ. అందరూ ఒక్కసారి నవ్వేరు.